క్లుప్తంగా

గ్రామ కాపు సంఘం అధ్యక్షుడిగా పసుపులేటి



భీమడోలులో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ

భీమడోలు: భీమడోలులో ఆదివారం గ్రామ కాపు సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామ అధ్యక్షుడిగా పసుపులేటి శ్రీను, కార్యదర్శిగా ఈతకోట బాబి, సంయుక్త కార్యదర్శిగా ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా ఈతకోట తాతాజీ, కోశాధికారులుగా ముప్పిరిశెట్టి రాజేష్, యర్రంశెట్టి వాసు, సభ్యులుగా ముప్పిరిశెట్టి పవన్‌శివరామ్, రామనుజన్ రవి, చిట్టూరి సతీష్, యర్రంశెట్టి ఫణి కుమార్, కె.నాగేంద్ర తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘాభివృద్ధికి, కాపుల ఐక్యతకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. నూతన కమిటీని పలువురు అభినందించారు. సమావేశంలో అధిక సంఖ్యలో కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేయండి



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఏఓ గద్దె రమేష్

దెందులూరు: కౌలు రైతులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.జితేంద్ర అవగాహన సదస్సు నిర్వహించారు. రైతుభరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది కౌలు రైతులు మంజూరు కార్డుల కోసం సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న కౌలు రైతు కార్డులను పొందేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది కౌలు రైతులకు సహాయ సహకారాలు అందించాలన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఖాళీలు

దెందులూరు: కొవ్వలిలోని నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఖాళీలున్నాయని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సత్యనారాయణ తెలిపారు. 5 నుంచి 10వ తరగతి వరకు దాదాపు 250 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి సౌకర్యాలతో అన్ని వసతులు కలిగి ఉన్న నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కొవ్వలిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై సమరశీల పోరాటాలు

ఏలూరు (టూటౌన్): ఆటో డ్రైవర్ల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సూరిబాబు, జె.గోపి తెలియజేశారు. ఏలూరు నగరం, చొదిమెళ్ల ఆటో స్టాండ్‌లకు చెందిన 20 మంది ఆటో డ్రైవర్లు సీఐటీయూలో చేరిన సందర్భంగా స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతనంగా యూనియన్‌లో చేరిన ఆటో డ్రైవర్లకు నాయకులు అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రైవర్లు అందరూ ఆటోరికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రతి ఒక్కరూ యూనిఫామ్ ధరించాలని కోరారు. ఏలూరు నగరంలో సీసీ కెమేరాల ద్వారా విధించిన ఈ–చలానాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సమావేశంలో వై.బాలాజీ, జి.డేవిడ్ రాజు, వి.దుర్గారావు, ఎల్.వెంకటేశ్వరరావు, సీహెచ్ ప్రసాదరావు, ఎస్.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆర్థిక సాయం



చల్లవారిగూడెంలో ఆర్థిక సహాయం అందజేస్తున్న గణేష్ యూత్ సభ్యులు

జంగారెడ్డిగూడెం రూరల్: చల్లవారిగూడెంలో గణేష్ యూత్ సభ్యులు చిన్నారులకు ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన చింతలపూడి వెంకటేష్, ఉష దంపతులు మరణించారు. వారి సంతానం వర్షిణి (8), వరుణ్ (6) తాత కనిక్ల రాజు, అమ్మమ్మ మణెమ్మల వద్దే ఉంటున్నారు. ఆ కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతుండడంతో గణేష్ యూత్ సభ్యులు స్పందించి ఆ ఇద్దరు చిన్నారుల పేరున బ్యాంక్ ఖాతాలో రూ: 20,000 నగదును జమ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు పసుపులేటి కిషోర్, సభ్యులు సత్రం దొరబాబు పాల్గొన్నారు.

తల్లికి వందనంలో కోత

- నాడు బాబు ష్యూరిటీ అంటూ ప్రచారం
- నేడు మేనిఫెస్టో హామీలకు తూట్లు
- సూపర్ సిక్స్ అమలుకు కొర్రీలు

దెందులూరు: ఎన్నికల ప్రచారంలో కూటమిలో ఉన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే ఒక్కొక్కరికీ రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి మేనిఫెస్టోలో తల్లికి వందనం పేరిట సూపర్ సిక్స్‌లో సైతం పొందుపరిచారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నెల రోజుల అనంతరం జీవో- 29ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఎన్నికల్లో ఒక కుటుంబంలో ఎంత మంది చిన్నారులుంటే అంత మందికీ ఒక్కొక్కరికీ రూ. 15 వేలు చొప్పున ఇస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన అనంతరం అమలు చేయకుండా కేవలం ఒకరికి మాత్రమే పరిమితం చేస్తామని ప్రకటించడంపై పలు సంఘాల నేతలు, మహిళలు తీవ్ర ఆగ్రహావేశాలు, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారిద్ర్యరేఖ దిగువన ఉన్న



ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు

పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలతో పాటు మధ్యతరగతి ప్రజలు సైతం కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలోని హామీలను ఎప్పుడు అమలు చేస్తుందోనని ఎదురుచూస్తున్నారు. చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం నుంచి సాయం అందుతుందని ఎదురుచూసిన తల్లిదండ్రుల ఆశలు నెలరోజుల్లోనే ఆవిరయ్యాయి. హామీలకు కూటమి ప్రభుత్వం కోత విధిస్తోందని పలువురు మండిపడుతున్నారు.

తీవ్ర అన్యాయం



తల్లికి వందనంలో కోత విధింపు తీవ్ర అన్యాయం. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో కోత విధించడం వల్ల చిన్నారులందరికీ తీవ్ర అన్యాయం జరగనుంది. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ప్రభుత్వం వల్ల మేలు జరుగుతుంది. మిగిలిన వారి పరిస్థితి ఏమిటి. వారికి ఆర్థిక సహాయం ఎవరు అందిస్తారు.

–నిట్టా లీలానవకాంతం, జెడ్పీటీసీ, దెందులూరు

మోసం చేయడమే ..



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమలు చేయకపోవడం దారుణం. ఇంటిలో ఒకరికే తల్లికి వందనం వర్తింపు చేస్తామని ఆదేశాలివ్వడం మోసం చేయడమే. ఈ విధానం సరైనది కాదు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని హామీలు అమలు చేయాలి.

– గొల్ల కిరణ్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు

ప్రజలందరూ గమనిస్తున్నారు



ప్రభుత్వం ఇచ్చిన జీవోలను రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారు. కూటమి నాయకులు ఎన్నికల్లో హామీలిస్తే చిన్నారులు సైతం సంబరపడ్డారు. నెల రోజుల్లోనే ఇంటిలో ఒకరికే తల్లికి వందనం పథకం వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించడం అన్యాయం. ప్రభుత్వం పునరాలోచించాలి.

– కనికెళ్ళ మురళీకృష్ణ, మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

పునరాలోచించాలి



ప్రభుత్వం, కూటమి పెద్దలు ఇచ్చిన తల్లికి వందనంపై ఇచ్చిన జీవోపై పునరాలోచించాలి. ఒకే కుటుంబంలో ఉన్న చిన్నారులందరికీ న్యాయం చేయాలి. ప్రతి చిన్నారికి ప్రభుత్వం పథకం వర్తింపజేయాలి. మేనిఫెస్టోను చిత్తశుద్ధితో అమలు చేయాలి.

– కట్టా ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి

హామీలు అమలు చేయాలి



సూపర్‌సిక్స్ యథాతథంగా అమలు చేయాలి. తల్లికి వందనం అమలు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది చిన్నారులకు మేలు కలుగుతుంది. ఈ పథకానికి ఆదిలోనే కోతపెడితే లక్షలాది మంది భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. సూపర్‌సిక్స్‌లో తల్లికి వందనం ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వం అమలు చేయాలి.

– తొత్తడివేదకుమారి, కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్

నిస్వార్థంగా సమాజసేవ చేయాలి

ఉంగుటూరు: లయన్స్ క్లబ్ అధ్యక్షుడుగా పుసులూరి ప్రకాష్ నిస్వార్థ సేవలు అందజేసి మంచి పేరు తెచ్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సమావేశంలో గన్ని ఆంజనేయులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లో సేవాదృక్పథంతో ఉన్న వారే ఉంటారని అన్నారు. నూతన అధ్యక్షుడు ప్రకాష్‌ని అభినందించారు. నూతన అధ్యక్షుడిగా పుసులూరి ప్రకాష్, కార్యదర్శిగా పాతూరి వంశీ, కోశాధికారిగా వంకిన ధర్మరాజు, ఉపాధ్యక్షుడిగా ఆకల పాండు రంగరాజు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం



నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో అధ్యక్షుడు ప్రకాష్‌ను అభినందిస్తున్న దృశ్యం

చేశారు. కమిటీ క్లబ్ కౌన్సిల్ కార్యదర్శి ఫంకజాక్షన్, ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ జిల్లా పర్వేపు గవర్నరు ఈపూరి సత్యనారాయణ, జోన్ చైర్మన్ రమణమూర్తి, గుణ్ణం బుల్లియ్య, పుప్పాల గోపి, అడపా శోభారాణి, జానకిరామరాజు పాల్గొన్నారు.

పెట్రోలు బంకుల్లో తనిఖీలేవీ?

దెందులూరు: పెట్రోలు బంకుల్లో సంబంధిత శాఖాధికారులు పర్యవేక్షణ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. పెట్రోలు, డీజిల్ విక్రయం చేస్తున్నారే తప్ప కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బంకుల్లో వినియోగదారులకు ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు. దీనిపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి బంకులో వాహనాలకు గాలి పెట్టే యంత్రం అందుబాటులో ఉండాలి. వాహనదారులు గాలి పెట్టమని బంకు సిబ్బందిని అడిగితే మరమ్మతుకు గురైందని, ఆపరేటర్ బయటకు వెళ్లాడని సమాధానం చెబుతున్నారని పలువురు ఆరోపించారు. కొన్ని బంకుల్లో ఈ సేవలు ఉండటం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఆశ్రం ఆసుపత్రి నుంచి ఏలూరు వెళ్లే దారిలో ఉన్న పెట్రోలు బంకుల్లో ద్విచక్ర వాహనాలకు గాలిపట్టడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. బంకు యజమానులు, అధికారులు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

నేత్రదానం స్ఫూర్తిదాయకం

దెందులూరు: ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ కొలుసు నాగ వెంకట సత్యనారాయణ (బాబూరావు) నేత్రదానం స్ఫూర్తిదాయకమని ఆర్టీసీ గన్నవరం సీటీఓ కొలుసు శ్రీరాములు అన్నారు. ఆదివారం దెందులూరు ఆయన స్థానిక యాదవుల వీధిలోని బాబూరావు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు. మరణానంతరం మరొకరికి చూపు ప్రదానం చేయాలన్న మహోన్నత భావంతో బాబూ రావు నేత్రాలను దానం చేయడం ఆర్టీసీ శాఖకు గర్వకారణంగా ఉందన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరు డిపో ఎంప్లాయిస్ యూనియన్, మజ్దూర్ యూనియన్ డ్రైవర్లు, కండక్టర్లు, వైఎస్సార్‌సీపీ నేత దెందలూరు కో ఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కొలుసు గణపతిరావు పరామర్శించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెదపాడు : ఓ వ్యక్తి అదృశ్యంపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ముక్కపాడుకి చెందిన మేకల రాఘవులు (32) రెండేళ్లుగా పెదపాడు మండలంలోని కొత్తూరులో బతుకు తెరువు నిమిత్తం వచ్చి జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8న స్వగ్రామంలోనే చదువుకుంటున్న తన పిల్లల సర్టిఫికెట్ల కోసం కొత్తూరు నుంచి స్వగ్రామానికి బయలు దేరాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు అన్నిచోట్ల వెతికారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. రాఘవులు తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర

భారీగా ఏర్పాట్లు చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నగరంలో రెండోసారి జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నారు. సోమవారం నిర్వహించనున్న ఈ రథయాత్ర నిమిత్తం ఇస్కాన్ ప్రతినిధులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక శనివారపు పేటలోని ఇస్కాన్ మందిరం వద్ద నుంచి రథయాత్ర ప్రారంభానికి సన్నాహకాలు చేస్తున్నారు. ఇప్పటికే రథం నగరానికి రాగా దానిని అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఆదివారం మందిరం వద్దకు చేరుకున్న రథాన్ని, రథంలో నగర యాత్ర చేయనున్న జగన్నాథుడు, జగన్నాథుని సోదరుడు బలదేవ్, సోదరి సుభద్ర ఉత్సవ విగ్రహాలను నగరానికి చెందిన పలువురు భక్తులు సందర్శిస్తున్నారు.

రథయాత్ర సాగేదిలా..

జగన్నాథ రథయాత్ర నగరంలోని అన్ని ముఖ్య ప్రాంతాలనూ కలుపుతూ ముందుకు సాగుతుందని ఏలూరు ఇస్కాన్ మందిర అధ్యక్షుడు రాధావల్లభ దాస్ తెలిపారు. స్థానిక లునాని పార్కు వద్ద ఉన్న ఇస్కాన్ మందిరం నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ రథయాత్ర స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్, రామచంద్రరావు పేట మెయిన్ రోడ్డు, ఒన్‌టౌన్, మెయిన్ బజారు మీదుగా సాగి రామకోటి ప్రాంగణానికి చేరుకుంటుంది. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఈ యాత్రను ప్రారంభించిన అనంతరం వందలాది మంది భక్తులు నృత్యాలు, కీర్తనలతో, గానాలతో, కోలాట ప్రదర్శనలతో నగర వీధుల్లో ఆనందోత్సాహాల మధ్య జరుగుతుంది. ఇందుకు గాను ఇప్పటికే వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 400 మంది ఇస్కాన్ ప్రతినిధులు



నగరానికి చేరుకున్న జగన్నాథుని రథం

నగరానికి చేరుకున్నారు. వీరితో పాటు నగరానికి చెందిన జగన్నాథుని భక్తులు ఈ రథయాత్ర వెంట నడవనున్నారు.

రామకోటిలో ప్రత్యేక కార్యక్రమాలు..

నగరంలోని ప్రధాన ప్రాంతాల గుండా సాగిన రథయాత్ర రామకోటి ప్రాంగణానికి చేరుకున్న అనంతరం అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇస్కాన్ ప్రతినిధులు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా సాయంత్రం 6.30 గంటల నుంచి రామకోటి ప్రాంగణంలో స్వామివారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం సమర్పించనున్నారు. అనంతరం జగన్నాథ ప్రవచనం, భక్తులందరికీ జగన్నాథ ప్రసాద విందు ఏర్పాటు చేశారు.

జగనన్న కాలనీల్లో వసతులపై మౌనమేల?

- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- చిత్తడి రోడ్లపై నడవాలంటే హడలిపోతున్న జనం

భీమడోలు: గుండుగొలను జగనన్న కొత్త కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోనే అతిపెద్ద లేవుట్‌లో జగనన్న కాలనీ రూపుదిద్దుకుంది. హౌసింగ్ అధికారులు ఈ కాలనీ వాసులకు అవసరమైన కనీస వసతుల కల్పనలో ఆది నుంచి తమకు పట్టనట్లు వ్యవహరిస్తూ మౌనం వహిస్తున్నారు. ఇటీవల పంచాయతీ అధికారులు అధ్వానంగా ఉన్న రోడ్లకు ఇరువైపులా డ్రెయిన్లు తవ్వారు. పూర్తిస్థాయిలో అక్కడి మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం చూపకపోవడంతో రోడ్లు చినుకు పడితే చిత్తడి మారుతున్నాయి. వందలాది మంది నివాసమున్న కాలనీ వాసులు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. మహిళలు, వృద్ధులు జారి పడి గాయాల పాలవుతున్నారు. ఈ కాలనీలో రోడ్లపై నడవాలంటే నరకప్రాయంగా మారింది. కొత్తగా ఎన్నికైన పాలకులు ఈ కాలనీపై ప్రత్యేక దృష్టి సారిస్తేనే సదుపాయాలు సమకూరుతాయని కాలనీ వాసులు అంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు



గుండుగొలను కొత్త కాలనీలోని చిత్తడిగా ఉన్న గ్రావెల్ రోడ్డు

లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై నీరు ప్రవహించడంతో కాలనీ వాసుల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. పేదలు నిర్మించుకునే గృహాలకు అవసరమైన మెటీరియల్ తీసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. రోడ్లపై కాలు వేస్తే జారి పడుతున్నారు. సంబంధిత హౌసింగ్ అధికారుల నిర్లిప్తత కారణంగా ఒక్క తట్ట మట్టి కూడా ఇక్కడి రోడ్లపై పోసిన పాపాన పోలేదు. దీనితో కాలనీ వాసులు నరకయాతనను అనుభవిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు మౌనం వహిస్తున్నారు. నిత్యం జీవనోపాధి కోసం, వివిధ పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సిన రైతులు, కూలీలు, విద్యార్థులు, ప్రజలు హడలుపోతున్నారు. ఈ కాలనీ వాసులు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్లను యుద్ధప్రాతిపదికన నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

దెందులూరు: మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకినాని కోరారు. ఆదివారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పెదవేగి మండలం వంగూరులో అద్దె భవనంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలకు స్థలం కేటాయించాలని, శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. దెందులూరు మండలం వేగవరంలో హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించిన భవనాల్లో 2017 నుంచి అద్దె ప్రాతిపదికన జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇటీవల గురుకుల పాఠశాలను ఖాళీ చేయమని హేలాపురి యాజమాన్యం కోరారన్నారు. దీంతో వంగూరులో పాత ప్రైవేటు కళాశాలకు సంబంధించిన భవనంలోకి గురుకుల పాఠశాల మార్చారని పేర్కొన్నారు. అక్కడ పాముల



ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాని

బెడద ఉందని వివరించారు. 240 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఒక ప్రిన్సిపల్ మినహా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అంతా పార్ట్‌టైం, కాంట్రాక్ట్ సిబ్బంది కావడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని వివరించారన్నారు. కార్యక్రమంలో ఎం.క్రాంతి, సీ.యశ్వంత్, ఐ.విజయ్ ఉన్నారు.

సీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుల కొరత

దెందులూరు: నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరులో స్టాఫ్ నర్సులు, నైట్ వాచ్‌మెన్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇక్కడ పని చేస్తున్న వైద్య సిబ్బందిపై అధిక పని భారం, రోగులకు అసౌకర్యం ఏర్పడుతోంది. ప్రతిరోజూ సీహెచ్‌సీలో 100–150 మంది పేషెంట్లు ఓపీ ఉంటోంది. అన్ని విభాగాల వైద్యులు సంతృప్తికరంగా వైద్య పరీక్షలు, సేవలు, శస్త్రచికిత్సలు అందించడంతో ఓపీ సంఖ్య గణనీయంగా పెరిగింది. సీహెచ్‌సీ నిబంధనల ప్రకారం వైద్యులతో పాటు స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, నైట్‌వాచ్‌మెన్ల పోస్టులు భర్తీ చేస్తే పూర్తిస్థాయి వైద్యసేవలు అందించే అవకాశం ఉంటుంది. సీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసి రోగులకు సకాలంలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గొలుసుల పంజాలో ప్రత్యేక ప్రార్థనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మొహర్రం కార్యక్రమాల్లో భాగంగా స్థానిక కుండీ సెంటర్‌లోని హజరత్ మౌలా అలీ మహాత్ముని ఆస్థాన (గొలుసుల పంజా)లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం పంజాలో ప్రతిష్ఠించిన పీర్లకు విశేష అలంకరణ చేసి దరూద్ సలాం పాటించారు. అనంతరం ఫాతెహా ఖానీ నిర్వహించి దివ్య ఖుర్‌ఆన్ గ్రంథ పఠనం చేశారు. ఈ సందర్భంగా పంజా వంశపారంపర్య ముజావర్ ఎండీ గాలబ్ అలీ మాట్లాడుతూ మొహర్రం నెలను షహీద్ (అమరవీరుల) నెలగా వర్ణిస్తూ పండుగలా కాక వర్ధంతిలా జరుపుకుంటామన్నారు. భారతదేశ ప్రజలంతా సోదరభావంతో మెలుగుతూ క్షేమంగా, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి అందరూ ఆరోగ్యంగా, సుఖశాంతులతో జీవించాలని ఈ నెలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పంజాలో ప్రతిష్ఠించిన పీర్ల వద్ద విశేష ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో నగరంలోని పలువురు హిందువులు కూడా పాల్గొనడం విశేషం. అనంతరం పంజాలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో సుమారు 1500 మంది పాల్గొని మౌలా అలీ మహాత్ముని ప్రసాదం స్వీకరించారు. అహలె సున్నతుల్ జమాత్ అధ్యక్షుడు షేక్ సాబీర్ హుస్సేన్, చప్పిడి సత్యనారాయణ, పంజా వంశపారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలి, ఎండీ గాలబ్ అలి, ఎండీ మౌలా అలి పాల్గొన్నారు.



గొలుసుల పంజాలో ప్రతిష్ఠించిన పీర్ల వద్ద ప్రార్థన చేస్తున్న దర్గా ముజావర్లు, ముస్లింలు

గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు

ఉంగుటూరు: రక్షిత మంచినీటి పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. ఆదివారం వెల్లమిల్లిలో జాతీయ జల జీవన్ మిషన్ ద్వారా మంజూరైన 7.10 లక్షలు వ్యయంతో నిర్మించనున్న మంచినీటి పథకానికి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 14 గ్రామాలకు పైపులైను ద్వారా మంచినీరు సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. శిలాఫలకాన్ని ఎంపీ ప్రారంభించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్‌డబ్ల్యూ



మంచినీటి పథకానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ పుట్ట మహేష్‌యాదవ్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఎస్ ఏఈ హరినాథరాజు పాల్గొన్నారు.ముందుగా ఉంగుటూరు గ్రామదేవత చల్లాలమ్మ తల్లిని, బద్రకాళీ అమ్మవారిని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు దర్శించుకున్నారు.

900 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి



దెందులూరులో నాట్లు వేసిన వరి పొలం

దెందులూరు: మండలంలో 17 గ్రామ పంచాయతీలో ఇప్పటి వరకు 900 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 1,400 ఎకరాల్లో వరి సాగవుతుందని, ఇందులో 900 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో రైతులు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారని తెలిపారు. సాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

బైనేరు బ్రిడ్జిపై ట్రాఫిక్‌కు అంతరాయం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో జాతీయ రహదారిపై ఉన్న బైనేరు బ్రిడ్జి వద్ద ఆదివారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జి వద్ద భారీ గోతులు ఏర్పడటంతో వాహనాలు గోతుల్లో ఇరుక్కుని బయటకు రావడానికి అధిక సమయం పడుతోంది. దీంతో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు ట్రాఫిక్ జామ్ నుంచి బయటకు పడటానికి నానా ఇబ్బందులు పడ్డారు. కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డిగూడెం పట్టణానికి రావడానికి, బయటకు వెళ్లడానికి బైనేరు వంతెన దాటాల్సి ఉంది. వాహనదారుల ఇబ్బందులు తొలగించేలా వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
90102 23729
99122 20559
Office mail : tpgadvt@gmail.com